# లేమి లేమి

లంకంత అవరణ – రాక్షసి లాంటి వేపచెట్టూ – అనీడలో వరలభావి – అక్కడా అక్కడా మొక్కా – మొరుసూ:

లంకంత అవరణలో, కూలేందుకైనా సత్తువలేని – కుటీరం అంత భవంతి.

యింటికి – అటూ అపులేదు – ఇటూ అపులేదు:

లచ్చమ్మ దొడ్డి వేపు పంచలోకి వచ్చి, కొయ్య బిందెలో బియ్యం అ కాసినీ చేటలో పోసి, కూర్చుని, నెరుపుతూ, కృష్ణా రామా అనుకుంటూంది.

కాకి, ఎగిరివచ్చి కవ్వుకో బోయింది: లచ్చమ్మ, పిడికెడు గింజలు తీసి, కిందకు జల్లింది – 'పండుగనాడు కేకేసి పట్టెడు కరుడు పడేస్తానుగాని – యివాళిటికి యీ గింజలే ఎంగిలి పడరా – కాకన్నా!' అంటూ, కాకి, గింజలన్నీ కతికి, ముందుకో కుంటి దుముకు దుమకగా – అరి, నీదెత్తి బంగారంగానూ, యీపూట కివి చాల్లే–ఇంకో గుప్పెడేద్దునుగాని, బుచ్చిగాడికి ఓ ముద్ద తక్కువౌతుందిరా – అయ్యా! హాయిగా అలా అలా ఎగిరిపోయి, కాసిని నీళ్ళు త్రాగు పోఁ!

కాకాయి, ఎగిరిపోయింది, తోటకూర మడి మీదుగా – లచ్చమ్మ అటు చూసింది. అటే చూసింది. జాలొచ్చి – నవ్వొచ్చింది.

ఎడమ భుజాన పిండి పిడిచిన నీర్కావి ధోవతి, కుడిభుజాన నీళ్ళు బిందె చేత రాగి కడవతో బుచ్చిగాడు, అమ్మా! అని సంతోషంగా బొబ్బలు పెట్టుకుంటూ యింట్లోకి వచ్చి, బిందే కడవా దేవుడి అరుగు దగ్గిర ఉంచి, జల్లి అంగ వస్త్రం కట్టుకొచ్చిన పారిజాతాలూ తులసిదళాలూ, దోసిలితో, స్వామి ముందు ఉంచి, వసారాలోకి వెళ్ళి భుజాన ధోవతి మరో పిండు పిండి – పింజె ఝూడించి దణ్ణెంమీద అరవేసి, అంగవస్త్రం విదిల్చి, మొగం, చిరుమీసకట్టూ తుడుచుకుని.

అమ్మా! స్వాములవారు, మన ఇంట్లో భిక్ష వేస్తారమ్మా!

దానికేం. ఎప్పుడు?

ఇవాళే!

అంతకన్ననా! వారు ఏ స్వాములవారు నాయనా!

నా చిన్నప్పుడు మనింటి కొచ్చారమ్మా. నాన్నా నీవు పాదపూజ చేశారమ్మా. అ శంకరస్వాముల వారేనమ్మా!

మన ఊరూ నాడూ ఎంత పుణ్యం చేసుకుందిరా నాయనా ఎక్కడ కనిపించారురా, వారు?

– కాలవకి స్నానానికి వచ్చారు. శిష్యులంతా ఒడ్డున ఉన్నారు. నేను అర్ఘ్యం యిస్తూ కన్ను తెరవగానే కనిపించారు. ముమ్మారు మునిగి, చేతులు జోడించి ప్రవర చెప్పకున్నాను. శివాలయంలో ఉంటాము రమ్మన్నారు! వెళ్ళి దయచేయమంటావమ్మా!

వారు ఒక్కరూ వస్తారా నాయనా మరి, శిష్యులూ - వారూ -

అమ్మా! పిలవాలని బుద్ధి పుట్టింది పిలుస్తాను. మన యిలవేలుపు నరసింహస్వామివారు, వారే ఆ బాదరబందీ అంతా పడతారులే మనకేమమ్మా!

ఔనులే వెళ్ళి రా నాయనా!

అమ్మా! దాసీదాన్ని కేకేసి, యీలోగా అరుగు అలికించి ముగ్గెట్టించవమ్మా!

దానిల్లు బంగారంగానూ, అది రేపూ మాపూ యింటి చాయలకురా వల్లకాదురా.

పోనీలే నేను చేయి చేసుకోనా-

అరి నీ కడుపుడకా! నేనున్న దెందుకు రా? పోయిరా!

అమ్మా! ఆ ఉన్న బియ్యం అత్తెసరుపెట్టి దొడ్లో తోటకూర రెండు కందిబద్దలు అడ్డంవేసి, పొడికూర వండవమ్మా!

అయ్యో, దాని కడుపున యింకా పదిమంది పుట్టా, ఇప్పుడిప్పుడే యింతకు ముందే, అచ్చమ్మగారి మే కొచ్చి పడి, మడి మట్టాం చేసిందిరా! రెమ్మ మిగల్చలేదురా.

పాపం ఎంత ఆకలి మీదుందో పోన్లే! చిట్టుడుకు నీళ్ళలో యింత చింతపండు పారెయ్. దివ్యంగా జుర్రుకోవచ్చు ఇంక నేను వెళ్ళిరానా. అమ్మా!

చినుకొస్తూంది, తండ్రీ, త్వరగా తెమిలిరా.

. . . .     . . . . .     . . . .

అయ్యా! మా యింటికి భిక్షకు దయ చేయాలి.

నారాయణ!

తమరు మాత్రమే దయచేయాలి. ఇంట్లో యివాళ బియ్యం కొంచెం నిండుకున్నాయి.

నారాయణ.

స్వాములవారు అర్చనకని లేచారు. ఒక శిష్యుడు బుచ్చిగాణ్ణి రెక్కపట్టుమని యివతలకు, లాక్కువచ్చినంత ధూకుడుగా అడుగులు వేయించి, కూలవేసినట్టు విదిలించి చేవిడచి, కొరకొర జూశాడు. బుచ్చిగాడు కోపం తాపం లేకుండా కూర్చున్న చోటనే ఉన్నాడు.

. . . .     . . . .     . . . .

లచ్చమ్మ, అత్తెసరు దించి, చారుకు అమర్చి పొయ్యిమీద పెట్టి, పెడపొయ్యి మీద పప్పు ఎనిపి, నాలుగు దోస వరుగులు పడేసి, మూతపెట్టి, పట్టెడు మాగాయి తీసి, నీళ్ళు పోసి పొజపెట్టి దేవుడి అరుగు దగ్గిరకు, నైవేద్యం తెచ్చి, ఒక్కపువ్వువేసి, రెండు చేతులా మ్రొక్కి చేయి చూపించి, 'లక్ష్మీ నృసింహ మమదేహి కరావలంబమ్' అని మననం చేసుకుంటూ ఉండగా -

అమ్మా! మా తల్లే - ఓ లచ్చమ్మ తల్లో! అంది, గుమ్మంలోంచి, చెంచు.

అదేమిటే తడుస్తూ అలా నిలుచున్నావ్ రా. యిలా పంచలోకి రా. అంది, లచ్చమ్మ ఆసినీవఁటే! అంటూ -

ఏమే నరిసీ, మనువుకాగానే మన ఊరు మరచి పోయినావు కాదూ! ఒలిచ్చుకున్నవాడు సుఖంగా ఉన్నాడు కదా! కూచోవే, ఓపలేని దానివి - యీ పిచ్చిముండ నిన్నంటి పట్టుకునే ఉందన్నమాట! దీన్ని ఓ ఇంటిదాన్ని చేయలేకపోయినావుటే ఎంతెదిగిందే భడవ! అంటూ కోతిని, దువ్వింది -

అవ్వా! ఆ నాడు, నేనూ, మా తలకు మాసినవోడూ వచ్చి నీకు మొక్కంగా యీ కోకిచ్చినావు. మా వోడికి తలకు రుమాలిచ్చినావు. నీసేతి సలువ మాయమ్మా! ఓనాడూ, బువ్వకు మొగం వాచింది లేదు. సుగంగ ఉంటిమమ్మా!

పొద్దులొచ్చినయ్. మాయమ్మ కాడికి వన్నుండము. ఆడు, ఆకడ ఆకడ తిమ్మడిని ఆడించి, నూకలడుక్కుంటూ యెనకబడ్డాడు. నేను అడుగు ముందేసిన. నిన్న మద్దినేళ ఓ పిడచ నంజినా కాలికి సత్తువ లేకపోయె: ఈ కడకు రాంగనే మా యవ్వ ఉంది గందా అని, ఎలుగెత్తినా అమ్మా! ఒక్క ముద్దెయ్యవూ!...

అయ్యో దానికేం భాగ్యమే! అని, లచ్చమ్మ వంటిన అన్నం వడ్డించింది. గిన్నె తుడిచి ఓ పిడచ, కోతికి వేసింది –

చినుకు బాగా ముదిరింది.

'కాస్సేపు నడుం వాల్చవే నరిసీ' అంది.

నరిసి, మూలిగింది –

అవ్వా పూరుడూ పున్నె యీడనే వచ్చేనేమో అని, కోతికి ఏదో కీసర – బాసలు చెప్పి ఉరుకెత్తించింది. మా యమ్మను తోడుకు రా బంపినా అంటూ గోడకు చేరగిలబడి, మరో సన్నమూలుగు మూలిగి అవ్వా! జీవంలో నీసేతి మీదుగా భూమ్మీద పడాలేమో! అంది.

అంతకన్నాటే! అంటూ లచ్చమ్మ రెపరెప వెళ్ళి, బుచ్చిగాడి, ధోవతి అంతుకుని, పోయిలో నిప్పులాగి, నీళ్ళు కాగుపడేసి, ధోవతి పంచకు, అడ్డంకట్టి నరసిని పొదివిపట్టుకుంది. నరిసి హమ్మా! అంది: లచ్చమ్మ నరసింహా! అంది! మూడు ఝాములకు, అర్చన ముగించి, స్వాములవారు, యువతలకు దయచేశారు. పరివేష్టించిన వారందరు సాగిలి పడినారు.

వారు బుచ్చిగాడి సమీపానికి వచ్చి 'పద' అన్నారు.

ఒక శిష్యుడు గొడుగు పట్టపోయినాడు. స్వాములవారు, శాటికొంగు బుచ్చిగాడి నెత్తిమీద వేసి, 'పద' అన్నారు.

. . . .    . . . .    . . . .

స్వాములవారు, యింటి దగ్గిరకు వచ్చారు. పసిపాప పోరు వినిపించింది.

అమ్మా అన్నాడు బుచ్చిగాడు.

స్వాములవారు గడప ఎక్కారు.

లచ్చమ్మ పంచలో నిలుచుని, చేతులు జోడిరచి, స్వామీ! మా లోగిలిలో – బుచ్చిగాడి, వెనుక మళ్ళా పసిపిల్ల పారాడలేదు. మీరు దయచేస్తాననంగనే ఆ కొరత తీరింది. తీర్చారు తండ్రీ! బాలపాపలున్న ఇంట పరగడుపు ఉంచి పాదిత్యం పాలేదు. నివేదన చేసిన ప్రసాదం మీకు ఉంకువచేసి ఆ బిడ్డకు అరగించబెట్టాను. ఆ పుణ్యమా అని, నొవ్వక నొచ్చక పువ్వల్లే ముంతెడు నీళ్ళూ పోసుకుంది.'

అంటూండగానే, నరిసి తల్లీ బలగం ఓ చెంపనుంచి, మంచం డోలీ కట్టుకు వచ్చారు. ఓ చెంపనుంచి, నరిసిని కట్టుకున్నవాడు వచ్చాడు. లచ్చమ్మ అరుగు దిగి ముందుకు వచ్చింది.

ఏమే సోమీ! బొప్పాయి పండంటి మనవ డుట్టాడే అంది నరిసి తల్లితో.

నరిసి బలగం అంతా చేతుల్లు జోడించింది. 'అ౯. అ౯. అరి మీ యిల్లు పచ్చని చేలే కట్టా! వారు స్వాములవారు రా. దేవుడు రా! వారికిరా దణ్ణం పెట్టాల్సింది.

మొక్కండర్రా మీ సిగలో మల్లెలు చుట్టా, మీ మొగాన కుంకుమపెట్టా, మీ చంకను పాపన్లెత్తా. పడండిరా పాదాలముందు' అని నవ్వు మొగంతో విలవిల్లాడింది.

బలగం బెరుకు, బెరుకుగా, స్వాములవారి వంక చూసి, ఆ చూపులోనే లచ్చుమ్మను చూసి, జోడించబోయిన చేతులకు బెదురుపుట్టా, ముందేసిన పాదానికి వణుకొచ్చి, తీగెలూగినట్టు ఊగుతూ నిలుచుండిపోగా.

తిమ్మడు కిచకిచమని, స్వాములవారి ముందుకు ఉరికి సాగిలపడి, ఓచెయ్యి, లచ్చుమ్మ కేసి, ఓ చెయ్యి స్వాములవారి కేసి జాచి, తల ఊపుతూ ముమ్మారు మొక్కులిచ్చాడు. స్వాములవారు చిరునవ్వు నవ్వారు. లచ్చుమ్మ తెల్లబోయింది.

నరిసి బలగం సాగిల పడింది.

వాన చప్పగా వెలిసింది!...

నరిసి, పసిగుడ్డుతో, మంచం సవారిలో వాళ్ళ గూడానికి వెళ్ళిపోయింది. డోలీ కదలగానే లచ్చుమ్మ అడ్డం కట్టిన ధోవతి తీసి, నరిసి తల్లి మీదికి విసిరేసి, పొత్తిళ్ళకుంటుంది లేవే అంది - అని.

బుచ్చిగాడి వంక చూసింది. అమ్మా నాకీ అంగవస్త్రం చాలదుటే! అన్నాడు బుచ్చిగాడు పకపకలాడుతూ -

స్వామీ, లోపలికి దయచేయండి! అంది లచ్చుమ్మ.

అందరూ స్నానాలు చేసి, దేవుడి అరుగు దగ్గిర కూర్చున్నారు. తలో పంచపాత్రడూ ఉదకం పుచ్చుకున్నారు. 'మరికొంచెం ఉంచనా స్వామీ' అంది లచ్చుమ్మ. స్వాములవారు గంభీరంగా, శాంతంగా, నారసింహో! అని ముమ్మారు ఉచ్చరించి, దేవుడి అరుగు వేపు శిరస్సు ఒగ్గి లేచి నిలుచుని, బుచ్చిగాడితో, 'నీవు - ఉండు' అని ఆజ్ఞగా చేసన్నతో చెప్పి, చిరునవ్వుతో కదిలిపోయినారు.

'స్వాములవారు అర్ధాకలితో వెళ్లారేమోరా నాయనా' అంది లచ్చుమ్మ, నీళ్ళు బిందెవంక చూస్తూ మరికాసిని ఉదకం పుచ్చుకోకపోతిరి అనుకుంది.

అకాలం అయింది కాదమ్మా! అంతకన్న ఏం పుచ్చుకుంటారులే! రేపు పెందరాళే భిక్షకు దయచేయమంటాను. ఈ వారా ఆ వారా, అప్పుడు స్వీకరిస్తారులే!

ఆఁ నేనూ అంతే అనుకున్నానులే వెళ్ళి పిలు నాయనా! వారి కటాక్షం మన మీదుంది. తప్పకుండా దయ చేస్తారు!

ఒరేయ్ బుచ్చిగా, చూడరా. అటు చూడరా! యింతకు ముందే కాదుట్రా మడంతా కలసిపోయింది! మళ్ళీ సిద్ధమైందిరా పెళ్ళి కూతురల్లే - పాపం అర్ధాకలి మీదుందేమోరా యీసారి, సుడి పెద్దది కట్రా. విత్తులు దట్టంగా చల్లరా - పిచ్చితల్లి, దానికి కడుపు నిండకపోతే పాదిత్యం రా - దాఁ అమ్మ-దా! వచ్చినదానవు ఊరికే పోరాదు. దాహమన్నా తాగి వెళ్ళు. అని నీళ్ళ బిందె పట్టుకు వచ్చింది. లచ్చుమ్మ.

[ఆనందవాణి]

★ ★ ★